ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 11-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- నూతన ఆవిష్కరణలకు కృత్రిమ మేధ (ఎఐ) ఎంతగానో దోహదపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు.
- రక్షణ రంగంలో పెట్టుబడులను విశేషంగా ప్రోత్సాహిస్తామని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.
- పార్లమెంటులో ఆరు కొత్త భాషలకు అనువాద సేవలను అందిస్తామని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈరోజు ప్రకటించారు.
- దేశంలో సైక్లింగ్‌ను ఆరోగ్య ప్రయోజనాలకు అనుసంధానం చేయాలని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియా కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నూతన ఆవిష్కరణలకు కృత్రిమ మేధ (ఎఐ) ఎంతగానో దోహదపడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు. ప్రస్తుతం ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి పారిస్ వేదికగా జరిగిన ఎఐ యాక్షన్ కమిటీ సమావేశానికి సహ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయంతో పాటు మరెన్నో కీలక రంగాలలో ఏఐ ని అనుసంధానించాలని సూచించారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి, వేగవంతమైన ప్రపంచాన్ని రూపొందించేందుకు ఎఐ నిర్వహించే పాత్ర అతి ముఖ్యమని అన్నారు. ఏఐ తో కొత్త తరహా ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఎఐ ఆధారిత భవిష్యత్తు కోసం ప్రజలలో నైపుణ్యం పెంచి, సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించాలని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్... 37 సెకన్లు) -సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సైక్లింగ్‌ను ఆరోగ్య ప్రయోజనాలకు అనుసంధానం చేయాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవియా కోరారు. ఢిల్లీలో ఈరోజు ప్రముఖ సైకిల్ తయారీదారులతో కేంద్ర మంత్రి సమావేశమై దేశవ్యాప్తంగా సైక్లింగ్‌ను ప్రోత్సహించే వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సైక్లింగ్‌ను ప్రోత్సహించడం ద్వారానే ఫిట్ ఇండియా సందేశాన్ని జనాలలోకి పంపించగలమని అన్నారు. ఊబకాయం, కాలుష్యంతో సహా అనేక సమస్యలకు సైక్లింగ్ మంచి పరిష్కారమని చెప్పారు. సైక్లింగ్ ని సమర్థవంతంగా ప్రచారం చేయడంతో పాటు మంచి మార్కెట్ చేయాలని సైకిల్ తయారీదారులకు సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ రంగంలో పెట్టుబడులతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అనుకూలమైన విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఏరో ఇండియా ప్రదర్శనలో భాగంగా ఈరోజు బెంగళూరులో జరిగిన రక్షణ మంత్రుల సదస్సులో ఆయన మాట్లాడుతూ, భారతదేశం శక్తివంతమైన రక్షణ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను  కలిగి ఉందని అన్నారు. ప్రపంచ భద్రతను పెంపొందించడం కోసం  భారత్ నిబద్ధతతో పనిచేస్తుందని రక్షణ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్... 35 సెకన్లు)-సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటులో ఇక నుండి బోడో, డోగ్రీ, మైథిలి, మణిపురి, ఉర్దూ, సంస్కృతంతో సహా ఆరు కొత్త భాషలకు అనువాద సేవలను అందిస్తామని  లోక్‌సభ సభాపతి ఓం బిర్లా ఈరోజు ప్రకటించారు. ప్రస్తుతం హిందీ, ఇంగ్లీషుతో పాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగు వంటి ఈ పది భాషలలో అనువాద సేవలు పార్లమెంటులో అందుబాటులో ఉన్నాయి. వీటితోపాటు తాజాగా మరో ఆరు కొత్త భాషలను అనువాద సేవలలోకి చేర్చామని ఆయన పేర్కొన్నారు. కాగా, భారతదేశంలో అధికారికంగా గుర్తింపు పొందిన 22 భాషలకు అనువాదం అందించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జేఈఈ (మెయిన్స్) ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. నిన్న ఫైనల్ కీ విడుదల చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారులు ఈరోజు విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. కాగా.. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ, బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దేశ వ్యాప్తంగా జనవరి 22, 23, 24, 28, 29 తేదీల్లో సెషన్ -1 పరీక్షలు జరిగాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చేపల ఉత్పత్తిలో రెండవ అతిపెద్ద దేశంగా భారత్ అవతరించిందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖా మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఆర్థిక సాంకేతిక మద్దతు అందించిన  కారణంగా ఇది సాధ్యపడిందన్నారు. లోక్‌సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల మత్స్య రంగం 126 శాతం వృద్ధిని సాధించిందని వెల్లడించారు. 2013-14లో దేశంలో చేపల ఉత్పత్తి 95.7 లక్షల టన్నులు కాగా, 2023-24 నాటికి ఏటా 184 లక్షల టన్నులకు పైగా ఉత్పత్తి నమోదైందని మంత్రి తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.  లోక్‌సభలో ఈరోజు కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చకు మంత్రి సమాధానమిస్తూ, కేంద్ర బడ్జెట్ జాతీయ అభివృద్ధి అవసరాలను ఆర్థిక ప్రాధాన్యతలతో సమతుల్యం చేస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం తీసుకున్న రుణాలలో 99శాతం మూలధన వ్యయంతో పాటు మూలధన ఆస్తులను సృష్టించడం కోసం వినియోగిస్తున్నామని ఆర్థిక మంత్రి వివరణ ఇస్తూ..

(వాయిస్... 30 సెకన్లు) -సెట్

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఏడు లక్షల డెబ్బై రెండు వేల కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పార్లమెంట్ లో ఈరోజు సభ్యులు అడిగిన ప్రశ్నలకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్ సమాధానమిస్తూ 2002లో ఈ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో లక్షా అరవై మూడు వేల ఆవాసాలకు రహదారి అనుసంధానం జరిగిందన్నారు. అదే విధంగా ఈ పథకాన్ని 4వ దశలో దేశవ్యాప్తంగా 25 వేలకు పైగా నివాసాలకు రహదారి అనుసంధానాన్ని కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్టైన్మెంట్ సమ్మిట్ (WAVES)2025 రీల్ మేకింగ్ ఛాలెంజ్ కి ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోంది. ఈ ఛాలెంజ్‌కు ఈ నెల 5 నాటికి భారతదేశంతో పాటు మరో 20 దేశాల నుండి 3 వేల 379 రిజిస్ట్రేషన్‌లు వచ్చాయని అధికార వర్గాలు తెలిపాయి.  రీల్ మేకింగ్ ఛాలెంజ్ అనేది 30-90 సెకన్ల మెటా సాధనాలను ఉపయోగించి ఔత్సాహిక ప్రతిభావంతులు తమ నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఉద్దేశించినది. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో ఇంటర్నెట్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఈ ప్రత్యేకమైన పోటీ నిర్వహించబడుతోంది. ఈ ఛాలెంజ్ డిజిటల్ సృష్టికర్తలకు షార్ట్-ఫార్మేట్  కంటెంట్ లో ప్రయోగాలు చేయడానికి ఉత్సాహపడే వారి కోసం ఒక వేదికను అందిస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్ము-కాశ్మీర్‌లోని  అఖ్నూర్ సెక్టార్‌లో ఈరోజు జరిగిన అనుమానాస్పద పేలుడు ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారు. ఉగ్రవాదులు జరిపిన అనుమానాస్పద పేలుడు పరికరం (ఐఇడి) దాడిలో ఇద్దరు జవాన్లు మరణించారని ఆర్మీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆర్మీ నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి గస్తీ నిర్వహిస్తుండగా ఐఇడి దాడి జరిగిందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =